بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّى عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْد

# ఖుత్బా జుమా సారాంశము

**దివి: 21.02.2014** **నజారత్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్ తరపున**

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరము హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

20 ఫిబ్రవరి రోజు నిన్న గడిచెను. ముస్లిహ్ మౌవూద్ (వాగ్దత్త సంస్కర్త) భవిష్యవాణి నేపథ్యంలో ఈ రోజుకు జమాఅత్‌లో చాలా ప్రత్యేకత గలదు. పుణ్యుడు, సత్పురుషుడు ఇతర చాలా లక్షణములు కలిగిన తన ఒక పుత్రుని గురించి ఇదే రోజు వార్తనందించి యుండిరి. గత శుక్రవారము కూడ నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సంకేతములను వివరించియుంటిని. 20 ఫిబ్రవరికి సమీప శుక్రవారమైనందున ఈ భవిష్యవాణిని ప్రస్తావించుట మంచిదని నేను భావించితిని. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ దీనిని ఒక గొప్ప సంకేతముగా అభివర్ణించిరి. విమర్శకులకు సమాధానముగా వారిట్లు స్పష్టముగా తెలిపిరి. మీరు విమర్శించెదరు, కాని ఇటువంటి భవిష్యవాణి చేయుట మానవ శక్తులకతీతమైనది. కేవలం కుమారుడగునని భవిష్యవాణి చేయుటయేగాక ఇటువంటి లక్షణములు గల, దీర్ఘాయువు పొందు కుమారుడు, వారి జీవితము లోనే జన్మించునని భవిష్యవాణి చేయబడెను. ఈ ప్రకటనను లోతైన న్యాయముతో చూచినచో ఇదొక అల్లాహ్ గొప్ప సంకేతముగా భావించుటలో సందేహముండదు. సందేహమున్నచో ఇటువంటి భవిష్యవాణి మీరు ప్రవేశపెట్టగలరని విమర్శకులతో వారనిరి. ఇదొక భవిష్యవాణి మాత్రమే కాదు, ఒక ఆకాశ అద్భుత సంకేతమని కనులు తెరిచి చూడవలెనని వారనిరి. ఇస్లాం సత్యమును, ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్పతనమును నిరూపించుటయే వారి అవతరణ అసలు ఉద్దేశము. ఇచట కూడ ఈ భవిష్యవాణిని ప్రవేశపెట్టి ఇది నా సత్యమునకు నిదర్శనమని వారనడం లేదు. దయాసాగరుడైన మన ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం సత్యము, గొప్పతనమును బహిరంగపరచుటకు వైభవోపేతుడైన అల్లాహ్ ఈ ఆకాశ సంకేతమును చూపెనని వారనిరి. వాస్తవముగా ఈ సంకేతము ఒక మరణించిన వానిని బ్రతికించుట కంటే వంద రెట్లు గొప్ప, ఉత్తము, అమోఘం, సంపూర్ణమైనదని వారనిరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ భవిష్యవాణి ప్రకారము మార్చి క్రీ.శ. 1889 సం॥లో ఆ వాగ్దత్త పుత్రుడు జన్మించెనని మనకు తెలుసు. వారు ఇస్లాం కీర్తికి, ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఘనతను స్థిరపరచుటకు ప్రళయ దినము వరకు గుర్తుండే అపూర్వ సేవలందించిరి. ఇతరులు కూడ వాటిని అంగీకరించిరి. 20 ఫిబ్రవరి 1886 క్రీ.శ నాటి ముస్లిహ్ మౌవూద్ భవిష్యవాణిని హుజూర్ చదివి వినిపించిరి.

హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) విశిష్టతలను లోతుగా గమనించినచో, హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సానీ హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ అల్‌ముస్లిహ్ మౌవూద్ జీవితమును పరిశీలించినచో అందుకు అనేక పుస్తకములు వ్రాయవలసి వచ్చును. ఒక ఖుత్బా లేదా ఒక ఉపన్యాసములో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ జీవితము, వారి గొప్ప కార్యములను వివరించలేము.

నేడు కూడ నేను ఈ భవిష్యవాణి నేపథ్యములో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ జీవితములోని పలు విషయాలను ప్రస్తావించెదను. వాస్తవానికి భవిష్యవాణి నేపథ్యములో గాక భవిష్యవాణిలోని ఒకటి రెండు కోణాలను వివరించెదను. స్వపక్షము, ప్రతిపక్షమును వారి విద్య, జ్ఞానము ఎంత వరకు ప్రభావితము చేసెనో కూడ. దీని కంటే ముందు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రచనలు, ప్రసంగాలు, ఉపన్యాసాల నివేదిక కూడ ప్రవేశపెట్టదలచితిని.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు రచనలు, లెక్చర్లు, ఉపన్యాసాల సంకలనం '**అన్వారుల్ ఉలూమ్**' పేరిట ఫజ్లె ఉమర్ ఫౌండేషన్ ప్రచురించుచున్నది. ఇప్పటి వరకు అన్వారుల్ ఉలూమ్ 24 సంపుటములు ముద్రించబడినవి.

వీటిలో 633 లెక్చర్లు, ఉపన్యాసాలు, రచనలు చేర్చబడినవి. ఫజ్లె ఉమర్ ఫౌండేషన్ స్కీమ్ అంచనా ప్రకారము 32 సంపుటములు ముద్రించబడును. ఈ విధముగా మొత్తం ప్రసంగాలు, ఉపన్యాసాలు, రచనల సంఖ్య 850 వరకు చేరవచ్చును.

ఇటులనే జుమా, పండుగలు, నికాహ్ ఉపన్యాసముల సంఖ్య 2076 గలదు. ఖుత్బాతె మహ్మూద్ 28 సంపుటములు ముద్రించబడినవి. వీటిలో 1602 ఖుత్బాలు గలవు. క్రీ.శ. 1948 సం॥ నుండి క్రీ.శ. 1959 సం॥ వరకు గల ఖుత్బాలు 29 నుండి 39 సంపుటములలో ముద్రించబడును. వీటిలో కూడ సుమారు 500 ఖుత్బాలు చేర్చబడును.

వారి విద్యా కార్యముల ఇదొక సాధారణ పట్టిక. వారి ప్రతి ఖుత్బా, ప్రతి ఉపన్యాసమును వినినచో, ప్రతి లెక్చర్‌ను చూసినచో విద్య, జ్ఞానపు వజ్రాలు ఒదిగినట్లు కనిపించును. విద్యా నదుల ప్రవాహము చూసి మానవుడు ఆశ్చర్యపడును. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాలిస్ కూడ ఒక సారి అభిప్రాయపడుచు ఇట్లనిరి. ఒక కోణము 'అతడు ప్రాపంచిక, ఆధ్యాత్మిక విద్యలతో పరిపూర్ణుడగును' లోనే గల విశాలమును ప్రస్తావించినచో అది అంతము కాదు.

ఈ విషయమును హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాలిస్ ఇట్లు తెలిపిరి. హుజూర్ పవిత్ర ఖురాన్ వివరణపై 8, 10 వేల పుటలు వ్రాసిరి. ఇది 10 సంపుటములలో గలదు. అల్ ఫాతిహా, అల్‌బఖరహ్‌తో పాటు మరో రెండు అధ్యాయములు వున్నవి. తర్వాత యూనుస్ అధ్యాయము నుండి అన్‌కబూత్ అధ్యాయము వరకు, 10వ అధ్యాయము నుండి 29వ అధ్యాయము వరకు గలదు. తర్వాత అన్నబా అధ్యాయము నుండి అన్నాస్ అధ్యాయము వరకు గలదు. అనగా 59 అధ్యాయముల వివరణ వ్రాసిరి. అతి చిన్న లిపిలో వ్రాసినను 6 వేల పుటలు గలవు. నేటి లెక్కన వ్రాసినచో 10, 12 వేల పుటలగును. ఇది కూడ మరల ముద్రించబడుచున్నది.

రచనలో 10 పుస్తకములు, పత్రికలు గలవు. ఆధ్యాత్మిక, ఇస్లాం ప్రవర్తన, ఇస్లాం విశ్వాసాలపై 31 పుస్తకములు, పత్రికలు వ్రాసిరి. జీవిత చరిత్రపై 13 పుస్తకములు, పత్రికలు వ్రాయగా చరిత్రపై 4 పుస్తకములు, పత్రికలు వ్రాసిరి. ఫిఖా (ధార్మిక సమస్యలు) గూర్చి 3 పుస్తకములు, పత్రికలు వ్రాసిరి. భారత దేశ విభజనకు ముందు రాజకీయంపై 25 పుస్తకములు, పత్రికలు వ్రాయగా భారత దేశ విభజన, పాకిస్తాన్ ఏర్పడిన తర్వాత 9 పుస్తకములు, పత్రికలు వ్రాసిరి. కాశ్మీర్ రాజకీయంపై 15 పుస్తకములు, పత్రికలు, అహ్మదియ్య ఉద్యమ ప్రత్యేక సమస్యలు, ఉద్యమాలపై సుమారు 100 పుస్తకములు, పత్రికలు ఇంకా అనేక వ్యాసములు గలవు. నేను తెలిపిన విధముగా ఇది వందలలో అనగా సుమారు 800 దాటును.

ఖలీఫా సాలిస్ ఇట్లు తెలిపిరి. "అతడు ప్రాపంచిక, ఆధ్యాత్మిక విద్యలతో పరిపూర్ణుడగును' అని తెలుపబడెను. వీటిని పరిశీలించగా వీటిలో ప్రాపంచిక విద్యలు, ఆధ్యాత్మిక విద్యలు కూడ కనిపించును. గర్వ కారణమేమనగా వారొక పుస్తకము, పత్రిక వ్రాయగా ఇంత కంటే మంచిగా ఎవరు వ్రాయలేరని ప్రతి వ్యక్తి అనెను. రాజకీయంలో ఎప్పుడైనా వారు నాయకత్వము వహించగా రాజకీయం గురించి నాయకత్వ అభిప్రాయాలు తెలుపగా పెద్ద పెద్ద వ్యతిరేకులు కూడ వారి నిరుపమాణ సామర్థ్యమును ఒప్పుకొనక తప్పలేదు.

తఫ్సీరె కబీర్ గురించి హుజూరె అన్వర్ ఇతరుల వ్యాఖ్యానములను ప్రవేశపెట్టిరి.

అల్లామా నియాజ్ ఫతహ్‌పూరి గారు తఫ్సీరె కబీర్ మూడవ సంపుటి నా ముందున్నదని ఒక ఉత్తరములో హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ గారికి ఇట్లు వ్రాసిరి. (వీరు అహ్మదీయులు కాదు) నేను దీనిని చాలా పరిశీలనతో చూస్తున్నాను. ఖురాన్ చదువుటకు ఒక నూతన ఒరవడిని మీరు ఆవిష్కరించిరనుటలో సందేహము లేదు. ఈ విశ్లేషణ ఒక కోణంలో మొదటిది. ఇందులో వివేకము, సూచనలను చాలా గొప్ప రీతిలో ఏకము చేసి చూపిరి. మీ విద్యా విశాలత, మీ దూర దృష్టి, మీ అసాధారణ పరిశీలన, ఆలోచన. మీ వివరణ సౌందర్యము ఒక్కొక్క అక్షరముతో స్పష్టమగుచున్నది. ఇప్పటి వరకు నాకెందుకు తెలియలేదని నాకు విచారము గలదు. నేను దీని మొత్తం సంపుటములను చూచినచో బాగుండును. నిన్న నేను హూద్ అధ్యాయపు విశ్లేషణలో హజ్రత్ లూత్ గురించి మీ అభిప్రాయాలు తెలుసుకొని ఆశ్చర్యపడి ఇట్లు వ్రాయక తప్ప లేదు. విశ్లేషకులను విడిచి "వీరు నా కుమార్తెలు" ను మీరు విశ్లేషించిన తీరును అభినందించుట నాకు సాధ్యము కాదు. అల్లాహ్

మీకు దీర్ఘాయుశ్శువు ప్రసాదించుగాక.

పట్నా కాలెజ్ ఫార్సీ శాఖాధ్యక్షులు ప్రొఫెసర్ అబ్దుల్ మన్నాన్ బేదిల్ గారి విశ్లేషణ గురించి పట్నా యూనివర్సిటీ ఉర్దు శాఖాధ్యక్షులు అక్తర్ గారు తన ఒక ప్రత్యక్ష సంఘటనను ఇట్లు తెలిపిరి. నేను హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని తఫ్సీరె కబీర్ పలు సంపుటములను పట్నా కాలెజ్ ఫార్సీ శాఖాధ్యక్షులు ప్రొఫెసర్, ప్రస్తుత పట్నా సాయంత్రపు కాలెజ్ ప్రిన్సిపల్ అబ్దుల్ మన్నాన్ బేదిల్ గారికి ఇచ్చితిని. వారు ఈ విశ్లేషణలను చదివి ఎంతో ప్రభావితులైరి. మదర్సా అరబియ షంసుల్ హుదా పండితులకు కూడ వారు చదువుటకు కొన్ని సంపుటములను ఇచ్చిరి. ఒక రోజు చాలా పండితులను పిలిచి వారి అభిప్రాయాలను తెలుసుకొనిరి. ఒక పండితుడు ఇట్లనెను. ఫార్సీ విశ్లేషణలలో దీనికి సాటి లేదు. అరబి విశ్లేణల గురించి అభిప్రాయమేమిటి ? పండితులు మౌనము వహించిరి. కొద్ది సమయము తర్వాత వారిలో నుండి ఒకరిట్లనెను. పట్నాలో అరబి విశ్లేషణలన్ని లభించవు. కనుక ఈజిప్ట్, సీరియా విశ్లేషణలన్ని చదివిన తర్వాతనే ఒక అభిప్రాయానికి రావచ్చును. ప్రొఫెసర్ గారు ప్రాచీన అరబి విశ్లేషణలను ప్రస్తావించడం ప్రారంభించి ఇట్లనిరి.

మిర్జా మహ్మూద్ విశ్లేషణ వంటి విశ్లేషణ ఏ భాషలో లభించదు. మీరు నూతన విశ్లేషణలను కూడ ఈజిప్ట్, సీరియా నుండి తెప్పించుకొనుము, కొన్ని నెలల తర్వాత నాతో మాట్లాడగలరు. అరబి, ఫార్సీ పండితులు అవాక్కైరి.

సయ్యద్ జాఫర్ హుసేన్ అడ్వకేట్ గారు సిద్ఖె జదీద్‌కు ఒక ఉత్తరములో ఇట్లు వ్రాసిరి. తఫ్సీరె కబీర్ చదివి నేను మొదటి సారి కాంతిమయమైతిని. మీరన్నట్లు (వారికి వ్రాయుచున్నారు) ఇస్లాం విద్యావంతులు పెద్ద ఆందోళన సృష్టించినా మన ఆచారమును వదిలి అహ్మదియ్య జమాఅత్‌లో నేను చేరుట సాధారణ విషయము కాదు. కాని సత్యము స్పష్టమైన తర్వాత ప్రమాదాలను ఇక్కడ లెక్క చేయలేదు. రాత్రింబవళ్ళు నేను సాష్టాంగములలో ప్రార్థనలు చేసితిని. ఓ అల్లాహ్ నాకు సత్పథము చూపుము. ఎన్నో నెలలు ఈ స్థితిలో గడిచి పోయనవి. నా సాష్టాంగ స్థలము కన్నీటితో తడిసెదని నేను మీకు నమ్మకముగా చెప్పుచున్నాను. నా ప్రార్థనలు ఆమోదించబడినవని నాకు నమ్మకము గలదు. ఎందుకనగా అహ్మదియ్య సంస్థ నిజమైనదను నమ్మకము కలిగెను. మియా వసీమ్ అహ్మద్ ఖాదియాన్ గారితో నేనొక ఉత్తరము ద్వారా బైఅత్ చేయదలచితినని మనవి చేసినాను.

మరల వారిట్లు తెలిపిరి. నా బైఅత్ స్వీకరించే ముందు ఒక అహ్మదీ ముస్లిం ప్రభుత్వమునకు విశ్వాసపాత్రుడిగా వుండుట, చట్ట పరిధిలో పనిచేయుట తథ్యమని ఖలీఫా గారు ప్రశ్నించిరి. హుజూర్ విశ్లేషణ ద్వారా ఈ విషయాలన్ని నాలో స్థిరపడినవని నేను సమాధానములో తెలిపితిని. కొన్ని రోజుల తర్వాత నా బైఅత్ స్వీకరించబడినదని నాకు తెలియగా నేను సష్టాంగము చేసితిని. తఫ్సీరె కబీర్‌లో ఒక చోట ముస్లిహ్ మౌవూద్ ఖైదీల విడుదలకు కారణమగునని నేను చదివితిని. ఆ తర్వాత కొద్ది రోజులకే నేను విడుదలైతిని. వాగ్దత్త ఖలీఫా గురించి 'అతడు ఖైదీల విడుదలకు కారణమగును' అను భవిష్యవాణికి నేను సజీవ సాక్ష్యమును.

మరోపక్క పశ్చిమ పరిశీలకులున్నారు. అమెరికా, ఐరోపా వివిధ పరిశీలకులలోని ఒకరి ఉదాహరణను నేను ప్రస్తావించెదను. ఇగ్లాండ్ పరిశీలకులు, అరబి, ఫార్సీ, ఇస్లామియ విద్యావంతులైన ఏ.జే.ఆర్బరి ఇట్లనిరి. పవిత్ర ఖురాన్ ఈ కొత్త అనువాదము, విశ్లేషణ పెద్ద ఘనకార్యము.

ఒక సీరియా డాక్టర్ అనస్ గారిట్లు వ్యాఖ్యానించిరి. కాంతి అన్వేషణలో వివిధ పండితుల రచనలు, విశ్లేషణలు చదివితిని. వీటిలో సుల్తానుల్ ఆరిఫీన్, ముహియుద్దీన్ ఇబ్నె అరబి, ముహమ్మద్ బిన్ అల్‌హాత్మీ అత్తాయి మొ॥ విశ్లేషణలు గలవు. కాని హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ విశ్లేషణలో పొందిన విశిష్టత, ఆకర్షణ, ఆనందము ఏ విశ్లేషణలో పొందలేదు.

మరాకిష్ వాసి జమాల్ గారిట్లు వ్రాసిరి. నేను ఈ విశ్లేషణను చదివి ఇతర విశ్లేషణలతో దీనిని పోల్చినప్పుడు భూమ్యాకాశ తేడా కనిపించెను. ఇక్కడ దైవ విద్యలు, వివేకముల ప్రవాహము, శాసన ఫలముల సారాంశముండగా ఇతర

విశ్లేషణలలో పోట్టుతో మాత్రమే సరిపెట్టుకొనిరి. ఈ విశ్లేషణ చదివినందుకు ఆత్మ వరకు ప్రభావితమైన ఇస్లాం మనోహర చిత్రము నా హృదయములో కలిగెను.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) లెక్చర్ల గూర్చి ఇతరుల అభిప్రాయాలను హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తాలా తెలిపిరి. పంజాబ్ యూనివర్సిటికి చెందిన పంజాబ్ సాహిత్య ఉద్యమ నాయకుని అభ్యర్థనపై లాహోర్‌లో 2 లెక్చర్లు ఇచ్చుటకు సయ్యద్నా ముస్లిహ్ మౌవూద్ ఒప్పుకొనిరి. దీని ప్రకారము హుజూర్ మొదటి లెక్చర్ 'అరబి జబాన్ కా మఖామ్ అల్సిన ఆలంమే' అనగా ప్రపంచ భాషలలో అరబి భాష స్థానము యుండెను. ఈ శీర్షికన 31 మే 1934 తేదీన లాహోర్ మాల్ రోడ్‌న గల వై.ఎం.సి.ఏ. హాల్‌లో మొదలయ్యెను. గౌ॥ డాక్టర్ బర్కత్ ఖురైషీ ఎం.ఏ., పి.హెచ్.డి. ప్రిన్సిపల్ ఇస్లామియా కాలెజ్ దీనికి అధ్యక్షత వహించిరి. హుజూర్ లెక్చర్ గంటన్నర సాగెను. దీనిని ప్రేక్షకులు అతి శ్రద్ధతో వినిరి. ముగింపులో అధ్యక్షులు కృతజ్ఞతలు తెలపుచు ప్రేక్షకులనుద్దేశించి లెక్చర్‌తో ప్రయోజనము పొందవలెనని అనిరి. ఇటువంటి విద్యావంతమైన వ్యాసములు వినే అవకాశము మరల లభించినదని అనిరి. ప్రేక్షకులలో ప్రతి విద్యా విభాగానికి చెందిన వారుండిరి.

చీఫ్ జస్టిస్ కాశ్మీర్ గౌ॥ లాలా భీమ్ సేన్ సుపుత్రులు లాల ఖమర్ సేన్ కూడ అక్కడ యుండిరి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహున్నీ ఉపన్యాసము, అధ్యక్షుల వారి ఉపన్యాసము తర్వాత ఇంగ్లిష్‌లో ప్రసంగించుచు తన అభిప్రాయమిట్లు తెలిపిరి. నేడు అరబి భాష ప్రాధాన్యతపై రసవత్తర, చరిత్రాత్మక ఉపన్యాసము నిపుణులైన ప్రసంగీకులు చేసిరి. దానిని విని నాకు చాలా ఆనందము కలిగినది. లెక్చర్ వినుటకు వచ్చినప్పుడు గత లెక్చరర్ల పద్ధతిలోనే లెక్చర్ వుండునని నేను భావించితిని. వారెట్లు ప్రసంగించెదరనగా ఒక ప్రముఖ నానుడి ప్రకారము అరబి భాష ప్రాధాన్యతకు గల కారణమును ఒక అరబ్బీయునితో అడగగా అందుకు మూడు కారణాలు తెలిపెను. మొదటి కారణము నేను అరబ్‌నకు చెందిన వాడను. రెండవది అది పవిత్ర ఖురాన్ భాష. మూడవది స్వర్గములో అరబి మాట్లాడబడును. ఇటువంటి విషయాలే అరబి భాష గురించి ప్రస్తావించబడునని నేను ఊహించితిని. కాని ఇవ్వబడిన లెక్చర్ గొప్ప విద్య, తత్వజ్ఞానముతో కూడినదైయుండెను. నేను వారి లెక్చర్‌లోని ఒక్కొక్క పదమును చాలా శ్రద్ధ, సంపూర్ణ ఏకాగ్రతతో విన్నానని నేను మిర్జా గారికి నమ్మకముగా చెప్పగలను. నేను దీనితో ఆనందము, లాభము పొందితిని. సుదీర్ఘ కాలము వరకు ఈ లెక్చర్ ప్రభావము నా హృదయముపై నుండునని నేను నమ్ముచున్నాను.

వైస్ ప్రిన్సిపల్ ఇస్లామియా కాలెజ్ లాహోర్, చరిత్ర శాఖాధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ ఖాదిర్ గారు ఇస్లామియా కాలెజ్ లాహోర్‌లో ఇస్లాం–భాగస్వామ్యం, ఇస్లాం–కమ్యూనిజమ్ శీర్షికన 'సన్ రైజ్ లాహోర్' పత్రికకు ఒక నోట్ ఇచ్చిరి. దానిలోని ఒక భాగము వ్రాయనైనది. వారిట్లనిరి. కమ్యూనిజమ్ శీర్షికన మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ గారి లెక్చర్ "ఇస్లాం కా ఇక్తిసాదీ నిజామ్" వినే అదృష్టము నాకు కూడ కలిగెను. వారి ఇతర లెక్చర్ల వలె నాకు వినే అవకావము కలిగినది. అది విద్యావంతులకు కాంతినిచ్చే గొప్ప జ్ఞానముతో కూడినదైయుండెను. మిర్జా గారు దైవ శక్తి స్వరూపులు. ఈ శీర్షికన ప్రతి అధ్యాయములో వారికి పూర్తి పట్టు గలదు. కావున మేము గౌరవించ, శ్రద్ధ వహించదగ అర్హత వారి అభిప్రాయాలకు గలదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. భవిష్యవాణిలో గల ప్రాపంచిక, ఆధ్యాత్మిక విద్యలతో పరిపూర్ణుడగును అను ఒక కోణం మెరుపు మాత్రమే. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్‌కు అల్లాహ్ ప్రసాదించిన విద్య, జ్ఞానమును చదివే అనుగ్రహము మనకు లభించుగాక. నేను తెలిపినట్లు వారి వ్యాసముల శీర్షికల పట్టికలో వివిధ రకాల వ్యాసములున్నవి. వాటితో కూడ లబ్ది పొందు అనుగ్రహము అల్లాహ్ మనకు కలిగించుగాక! మనము మన విద్య, జ్ఞానమును పెంచుకొనుము గాక! ఖుత్బా జుమా చివరలో హుజూర్ అయ్యదహుల్లాహు తాలా గౌ॥ సాహిబ్జాద మిర్జా హనీఫ్ అహ్మద్ మరణ వార్త తెలుపుచు వారి సంక్షిప్త పరిచయము వివరించిరి. జుమా నమాజ్ తర్వాత వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన కూడ చేయించిరి.